## క్లుప్తంగా

### బీఎల్‌ఎఫ్ కమిటీ ఎన్నిక


రాగసుధ, కన్వీనర్

నర్సంపేట : బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్‌ఎఫ్) నియోజకవర్గ కమిటీని 18మందితో మంగళవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా వంగల రాగసుధ, కో కన్వీనర్‌గా కొత్తకొండ రాజమౌళిలను ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ సభ్యులుగా కలకోట్ల యాదగిరి, జన్ను రమేష్, మార్త నాగరాజు, మహ్మద్ అలీసాబ్, గాజుల వెంకటయ్య, పద్మ, హరిబాబు, సింగతి కిరణ్, నాగెల్లి భాస్కర్, గణిపాక బిందు, ఎండి.మాషుక్, అశోక్, కుక్కల యాకయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### సీపీఐ మండల కార్యవర్గం..


అనంతరెడ్డి, కార్యదర్శి

చెన్నారావుపేట : సీపీఐ మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పత్తి అనంతరెడ్డి, సహాయ కార్యదర్శిగా గుగులోత్ నరసింహతో పాటు పదిమంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మర్రి సాంబయ్య ఆత్మశాంతికోసం సంతాప సభ నిర్వహించారు. అక్కపెల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వర్, ఇల్లందు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### టీబీఎస్‌ఎస్‌కు రాజీనామా

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్, ధర్మారం గ్రామానికి చెందిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం(టీబీఎస్‌ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నాయిని భరత్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం ధర్మారంలో ఈ మేరకు ఆయన తన నిర్ణయాన్ని మీడియా సమావేశంలో వెల్లడించారు. బడుగు,బలహీన వర్గాలను కలుపుకుని మరో బీసీ ఉద్యమ వేదికను త్వరలో ఏర్పాటు చేస్తానని ఆయన ప్రకటించారు.

### విశ్వరూప సభను విజయవంతం చేయాలి



వర్ధన్నపేట : ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాసాని గోపాల్ అన్నారు. మంగళవారం వర్ధన్నపేటలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. మాదిగ, మాదిగ ఉప కులాలు, వర్గీకరణను సమర్థించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో గోలి సుధాకర్, బిర్రు గోపాల్, ఐత రాజు, తాళ్లపెల్లి రమేష్, సీనపెల్లి రాజు, అఖిల్, బాసాని సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### మెట్ట వరిసాగు పరిశీలన

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏరువాక శాస్త్రవేత్తలు మెట్ట వరిసాగును సందర్శించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణకుమార్, ఫౌండేషన్ ఏరియా మేనేజర్ రాజు, గురిజాల ఎంపీటీసీ శ్రీలతరమేష్, సీఏఫ్ భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లు, డ్రెయినేజీల..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ గరీబ్‌నగర్‌లోని రోడ్లు, డ్రెయినేజీలను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. కాగా స్థానిక కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతో వరద, ముంపు బాధ తప్పిందని వారు తెలిపారు. నాయకులు సుంకరి శివ, 16వ డివిజన్ అధ్యక్షుడు పోగుల సంజీవ, మార్త రాజశేఖర్, నర్సింహ తదితరులు ఉన్నారు.

**సోక్‌పిట్‌లను పరిశీలించిన ఏపీడీ**

గీసుకొండ మండలంలోని ఊకల్‌హవేలిలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన కమ్యూనిటీ సోక్ పిట్‌లను ఏపీడీ వీరమల్ల సాయిచరణ్ మంగళవారం పరిశీలించారు. పనులను పూర్తి చేయడంతో ఆయన సంబంధిత ఉద్యోగులను అభినందించారు. శ్రీధర్, సుధాకర్, సుష్మ, నర్సింగరావు పాల్గొన్నారు.

### డ్రైవింగ్ లైసెన్స్ మేళాను వినియోగించుకోవాలి



రాయపర్తి : ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించే ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను వినియోగించుకోవాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఐత రాంచందర్ కోరారు. మంగళవారం రెండో రోజు దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్రబోయిన సుధాకర్, చందు రాము, ఎండీ అక్బర్, కుమార్, అఫ్రస్‌పాషా, ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

# రైతులకు తప్పని కరెంట్ కష్టాలు

- త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేక ఇక్కట్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

చెన్నారావుపేట : వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజన రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలరోజులుగా వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా లేదని ఇటీవల కురిసిన గాలి వాన బీభత్సంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగాయన్నారు. అలాగే విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. అదేవిధంగా పలు చోట్ల విద్యుత్ తీగల కోసం రైతులే సొంతంగా కర్రలతో స్తంభాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వర్షం కురిసిన సందర్భాల్లో విద్యుత్ సరఫరా కావటం లేదని అన్నదాతల తెలిపారు. విద్యుత్ అధికారులకు చెప్పిన వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తమకు విద్యుత్ సరఫరాను వెంటనే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా లచ్చిరాం, వాంకుడోత్ కిషన్, వాంకుడోత్ శ్రీను, బోడ ధన్‌సింగ్, రవి, బోడ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమతి లేని కనెక్షన్లు మాత్రమే తొలగించాం..

వర్ధన్నపేట : మండలంలోని శ్రీరామోజీ కుమ్మరిగూడెంలో ఎస్‌ఎస్-63 ట్రాన్స్‌ఫార్మర్‌పై అనుమతి లేకుండా వినియోగించుకుంటున్న కనెక్షన్లు మాత్రమే తమ సిబ్బంది తొలగించారని వర్ధన్నపేట విద్యుత్ ఏడీఈ ప్రశాంత్, ఏఈఈ అనిల్ మంగళవారం 'సాక్షి'కి వివరించారు. 'కరెంటోళ్లకు కోపమొచ్చింది' అనే వార్త కథనానికి పైవిధంగా వారు స్పందించారు. కుమ్మరిగూడెం తండాలో 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు వల్లనే తరుచూ కాలిపోవడం, మరమ్మతులకు గురి కావడం జరుగుతుందన్నారు. రైతులు డీడీలు చెల్లిస్తే వారికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని, వారు అర్హులైతేనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. బావి, లేదా బోరు ఉంటనే అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. తమ సిబ్బంది ఏ రైతు వద్ద డబ్బులు తీసుకోలేదని, మరమ్మతులకు వస్తువులు విద్యుత్ శాఖ నుంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సారెస్పీ కెనాల్‌పై వ్యవసాయ పంపు సెట్లు వినియోగించవద్దని సూచించారు.

# విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు


గురిజాలలో బస్సును ప్రారంభిస్తున్న బాధ్యులు


వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం నర్సంపేట డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు గుడిపూడి రాంచందర్‌రావు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మంగళవారం బస్సును ప్రారంభించారు. ఉదయం 8గంటలకు నర్సంపేట నుంచి మహేశ్వరం గ్రామం మీదుగా, గురిజాల క్రాస్ రోడ్డు, రాములునాయక్ తండా, గురిజాల, గుర్రాలగండి రాజపల్లి, మహబూబ్‌పల్లి, లింగాపురం, గురిజాల, హేమ్లానాయక్ తండా, గురిజాల క్రాస్ రోడ్డు, తిరిగి నర్సంపేటకు చేరుకుంటుందన్నారు. విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**బస్సు సౌకర్యం కల్పించాలని వినతి**

నర్సంపేట : విద్యార్థులు చదువుకునేందుకు పట్టణాలకు రావడానికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నందున ఆయా గ్రామాలకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం నర్సంపేట డిపో ఇన్‌చార్జ్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తామంటూ కలలుగంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఇప్పటికైనా నర్సంపేట డీఎం స్పందించి గతంలో ఉన్నటువంటి బస్ సర్వీసులను మళ్లీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాత్రి అనిల్, రాకేష్, కిరణ్, తరుణ్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


రాయపర్తి : శిబిరంలో పాల్గొన్న వైద్యులు


దుగ్గొండి: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయపర్తి : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మైలారంలో బాలవికాస ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు నిఖిల్, అనూష, ప్రసన్న, కృష్ణవేణి, సుభాష్, పాషా, బాలవికాస ప్రతినిధులు రాణి, ఫాతిమా, అనురాధ, ఆశ వర్కర్లు రేణుక, హైమావతి పాల్గొన్నారు.

**ఉచిత వైద్యశిబిరం**

దుగ్గొండి : మండలంలోని మందపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో ప్రతిమ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొగ్గం మహేందర్, బాలవికాస ప్రతినిధులు శ్రీదేవి, రమాదేవి, సంధ్య, ఆశ కార్యకర్త రజిత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు'


నెక్కొండ: మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం రైతుల్ని అన్ని విధాలుగా మోసం చేస్తోందని, రైతు రుణమాఫీ చేయని బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని టీపీసీసీ సభ్యుడు, డోర్నకల్ నియోజక వర్గ కోఆర్డినేటర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయి నుంచే బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రైతు సదస్సుల పేరుతో రైతుల్ని ఇంకా మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో రావుల హరీష్‌రెడ్డి, దూదిమెట్ల మల్లిక్‌యాదవ్, హరిప్రసాద్, గై లక్ష్మణ్, లావుడ్యా తిరుమల్, జాటోత్ భిక్షపతి, మాదాటి శ్రీనివాస్, చెన్నకేశవులు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి**

నర్సంపేట : రైతులకు 24గంటల విద్యుత్ అవసరం లేదని తెలియజేసిన తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదా స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో చెప్పించాలని నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు.టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి బదనాం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 24గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత ఉందన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిక



నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేట మండలంలోని ఆకులతండా గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నామాల సత్యనారాయణ, శ్రీకాంత్, వార్డు మెంబరున్నారు.

## 'ఆరోపణలు సరికాదు'

పర్వతగిరి : వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు టికెట్ ఇవ్వొద్దని తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పేద జన భూసంస్కరణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కి గోపాల్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలో గతంలో దొరలు పాలించారని, అప్పుడు అభివృద్ధి శూన్యమన్నారు.

# మధ్యాహ్న భోజనానికి నిధులు కేటాయించాలి

నర్సంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి పైసా గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులందరికి మిడ్ డే మిల్స్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు మోహన్, నాయకులు ప్రభు, కిరణ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


ఖానాపురం: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బాధ్యులు

ఖానాపురం : ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య అన్నారు. ఈ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ డీటీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలన్నారు. కొర్ర రమేష్‌తో పాటు పలువురు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

**పీఆర్‌సీని నియమించాలి**

పర్వతగిరి : పీఆర్‌సీని (పే రివిజన్ కమిషన్) నియమించి ఐఆర్‌ను వెంటనే మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహంకాళి రామస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పీసీ) దశల వారీగా పోరాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నుంచి కల్లెడ పాఠశాల వరకు భాగస్వామ్య సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించాలని అన్నారు.. ధనిక రాష్ట్రంలో వేతనాల కోసం 15వ తేదీ వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, మొదటి తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నగదు రహిత వైద్యం అందక హెల్త్ కార్డులు వ్యర్థమయ్యాయన్నారు. కార్యక్రమంలో కందగట్ల రమేష్, చంద్రమౌళి, బి.తిరుపతి, రవీందర్, బి.రాజేంద్రప్రసాద్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై

నెక్కొండ : మండల కేంద్రంలో సర్వే నంబర్లు 436, 32లను రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిని గుర్తించడంలో అధికారులు విఫలం చెందారని సీపీఎం మండల కార్యదర్శి ఈదునూరి వెంకన్న ఆరోపించారు. రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ గేటు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరుపేదలు బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై జిల్లా కలెక్టర్, నర్సంపేట ఆర్డీఓల దృష్టికి తీసుక వెళ్లామన్నారు. అధికారులు ఆదేశించినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు పట్టింపులేమి ధోరణి అవలంభిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై జానీపాష ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళన విరమించక పోవడంతో నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు దృష్టికి ఎస్సై తీసుకవెళ్లారు. దీంతో ఏసీపీ స్పందించి ఆందోళనకారులతో ఫోన్ మాట్లాడారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు వస్తున్నారని ఆందోళన విరమించాలని ఏసీపీ సూచించారు. దీంతో ఆందోళన విరమించామని వెంకన్న తెలిపారు. ప్రభుత్వ భూమి అని గుర్తించిన వెంటనే ఇళ్లు లేనిపేదలకు పట్టాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్ఐ నరేందర్, మండల సర్వేయర్ కుశాల్ కుమార్ వివాదస్పదమైన భూముల్లో సర్వే చేపట్టారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు పేర్కొన్నారు.

## క్రైం కార్నర్

**మద్యం మత్తులో వ్యక్తి మృతి**


అమ్ము మృతదేహం

రాయపర్తి : మండలంలోని జయరాంతండా శివారు సూక్యతండాకు చెందిన గుగులోత్ అమ్మునాయక్ (60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అమ్ము నాయక్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కాగా మంగళవారం మద్యం మత్తుతో నిద్రలోనే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు.

**గుండెపోటుతో వ్యక్తి..**


రమేష్(ఫైల్)

సంగెం : ట్రాక్టర్ నడుపుతూ గుండెపోటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణానగర్ గ్రామానికి చెందిన మేకల రమేష్‌యాదవ్(38) వ్యవసాయంతో పాటుగా ట్రాక్టర్ పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం పొలం దున్నుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ఎంజీఎంకు తరలించగా పరీక్షించిన వైద్యులు రమేష్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రమేష్‌కు భార్య రజిత కుమారులు నిరుప్, ఆరుష్ ఉన్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రం శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలానికి చెందిన వాకిడి రాకేష్, రాజ్‌కుమార్ తమ ద్విచక్ర వాహనంపై దామెరవంచ నుంచి ఏటూరునాగారం వెళ్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడ నుంచి వరంగల్ వెళ్తున్న వనవాసం అప్పారెడ్డి ఖానాపురం శివారులో ద్విచక్ర వాహనాన్ని తన కారుతో ఢీ కొట్టాడు. ప్రమాదంలో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తిరుపతి తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**ఉద్యోగ భద్రత కల్పించాలి**

పర్వతగిరి : గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష కార్మికులకు మంగళవారం పూలదండలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు.

**పరామర్శ**

నర్సంపేట : నర్సంపేటలోని వల్లభ్‌నగర్‌కు చెందిన శివరాత్రి రాజు మృతి చెందాడు. కాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం రాజు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

**మంత్రిని కలిసిన మండల నాయకులు**

రాయపర్తి : అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపినట్లు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు చెప్పారు.

**ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు**

రాయపర్తి : బదిలీపై వచ్చిన ఎస్సై విజయ్‌కుమార్‌ను మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ తెలిపారు. పీఏసీఎస్ డైరెక్టర్లు కుంట రమేష్, ఓరుగంటి వెంకన్న, ఎండీ మహమూద్, మచ్చ రమేష్, రాధారపు రాజు పాల్గొన్నారు.

**తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు**

సంగెం : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఆళ్ల కృష్ణారావు(58), తిరుపతమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు శ్రావణి, పల్లవి ఉన్నారు. అనారోగ్యంతో కృష్ణారావు మృతి చెందగా మంగళవారం కృష్ణారావు అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడు లేకపోవడంతో పెద్ద కూతురు శ్రావణి కుండపట్టి తండ్రికి తలకొరివి పెట్టింది.

**నారు మడిపై గడ్డి మందు పిచికారీ**

చెన్నారావుపేట : మండలంలోని బోజెర్వు గ్రామానికి చెందిన రారోజు వెంకటాద్రి అనే రైతుకు చెందిన వరి నారు మడికి సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో రూ.6,500 వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

**నోట్‌బుక్స్ పంపిణీ**

సంగెం : మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్‌లో భారత్ సేవ శ్రమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నోట్‌బుక్స్‌లు పంపిణీ చేశారు.కాగా 450 మంది విద్యార్థులకు పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింతం ప్రవీణ్ వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముజుబుర్ రహమాన్, ఎస్‌ఎంసీ చైర్మన్ మందపురి బలరాం, ఉప సర్పంచ్ చెన్నూరి యాకయ్య, మాజీ ఎంపీటీసీ దొనికెల శ్రీనివాస్, నాయకుడు ముదిదే శ్రీనివాస్, పెరిక సంఘం గ్రామ అధ్యక్షుడు అచ్చ పరమేశ్వర్, నాయకులు అచ్చ రాజు, మధుకర్, కార్తీక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు దుస్తులు..**



నెక్కొండ : మండలంలోని పెద్దకొర్పోలులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు ఎంపీపీ జాటోత్ రమేష్‌నాయక్ ఉచిత దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ మహ్మద్ మైబూబ్‌పాష, ఎస్‌ఓ రజిత, ఎంపీటీసీ సుకన్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

**అభినందన**

నెక్కొండ : తెలంగాణ రాష్ట్ర సైనిక గురుకుల పాఠశాల బాలుర(అశోక్‌నగర్)లో ఆరో తరగతిలో సీటు సాధించిన విద్యార్థి ధరావత్ వినయ్‌కుమార్‌ను ఎస్సై జానీపాష మంగళవారం సన్మానించారు. విద్యార్థి దశ నుంచే చదువే లక్ష్యంగా ముందుకు నడవాలని ఎస్సై అన్నారు.

**లక్ష్యసాధనపై దృష్టి సారించాలి**

పర్వతగిరి : విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి సారించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంపాక్ట్ ట్రెయినర్ ఏతుల సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యక్తిత్వ వికాస శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ నాజియా సల్మా, చెట్టబోయిన విద్యాసాగర్, గారే జయరాజ్, కల్పన రాహుల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యనందించడమే ధ్యేయం**

రాయపర్తి : విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చి సీట్లు సాధించేలా కృషి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మండలంలోని ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ సర్పంచ్ చెడుపాక కుమారస్వామి తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన విద్యార్థులకు కాంపిటీషన్ బుక్స్‌ను ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, జగన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

**ఆర్థికసాయం**




రాయపర్తి : మండలంలోని కాట్రపల్లికి చెందిన గుండ్లపల్లి పెద్ద అశోక్ ఇటీవల మృతిచెందాడు. కాగా విక్టరీ యూత్ సభ్యులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల నగదు అందించినట్లు తెలిపారు. యూత్ అధ్యక్షుడు గుండ్లపల్లి చిన్న అశోక్, ముద్రబోయిన శ్రీనివాస్, మొర్రి రాజేందర్, పెంతల రాజు, భిక్షపతి, రాజు, సుమన్, అనిల్ పాల్గొన్నారు.

**అంత్యక్రియల కోసం సాయం**


గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన ఆడెపు భద్రమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. కాగా ఆమె అంత్యక్రియల కోసం స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.5వేల ఆర్థికసాయం చేయగా, సర్పంచ్ దొడు బాబు, కర్ణకంటి రాంమూర్తి, సత్యనారాయణ, నరేందర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

**అల్బెండజోల్ మాత్రలు వేయించాలి**



ఖానాపురం : చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ మండల వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ సుమనవాణి, డాక్టర్ భూపేష్, ఎంపీఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

## గిర్నిబావిలో కొండెంగ బీభత్సం



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో ఓ కొండెంగ బీభత్సం సృష్టించింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే తిష్టవేసి వ్యాపారులను నానా ఇబ్బందులకు గురిచేసింది. ఓ వ్యాపారి షాపు వద్ద బైక్‌పై కూర్చుని అద్దంలో తన అందాన్ని తదేకంగా చూసుకుంది. అలాగే వివిధ షాపుల వద్దకు వెళ్లి అక్కడి జనాలను భయపెట్టింది. నలుగురు ప్రయాణికులను కరవడంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. అయితే స్థానికంగా ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద షెడ్డులో కూర్చుని బీరు తాగుతున్న వ్యక్తి వద్దకు కొండెంగ వచ్చి బీరు బాటిల్‌ను తీసుకుని గటాగటా తాగింది.. కాసేపటికి పిచ్చి పట్టినట్లు జనాలను ఇబ్బందులకు గురిచేసింది. కొండెంగ భయంతో చాలా దుకాణాలను సాయంత్రం వరకు యజమానులు మూసివేశారు.